# అత్తాపూర్ రాంబాగ్ మైదానంలో
# 7వ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు

**●డిసెంబర్ 25 నుంచి 28 వరకు జరగనున్న కుస్తీ పోటీలు ● ఏర్పాట్లను పర్యవేక్షించిన బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారెగూడెం మల్లారెడ్డి**

**●డిసెంబర్ 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుస్తీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల బరువు కొలత**

ఇది కద నిజం, అత్తాపూర్: అత్తాపూర్ పరిధిలోని రాంబాగ్ టెంపుల్ గ్రౌండ్‌లో 7వ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్పు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా నిర్వహించే సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంప్రదాయ క్రీడలకు ప్రతీకగా నిలిచే ఈ కుస్తీ పోటీలు అత్తాపూర్ ప్రాంత ప్రజలతో పాటు పరిసర జిల్లాల ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ క్రమంలో చేవెళ్లే పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారెగూడెం మల్లారెడ్డి కుస్తీ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. కుస్తీ పోటీలు నిర్వహించే రింగు వద్ద





ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు నిర్వాహకులకు సూచనలు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మల్లయోధులు ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి వస్తుండటంతో, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లయోధులతో పాటు ప్రేక్షకులకు కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సాబాధ విజయ్ కుమార్, విజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

*ఈ సందర్భంగా నారెగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ,“లిభారతీయ సంప్రదాయ క్రీడలైన కుస్తీలను ప్రోత్సహించడం మన బాధ్యత. యువత శారీరక దృఢత్వంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకునేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి” అని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు అత్తాపూర్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని, ఆయన అన్నారు.

కుస్తీ విభాగాలు:

పురుషుల విభాగంలో 32 కిలోల నుంచి 86 కిలోలు, 86 కిలోల పైబడి వివిధ బరువు కేటగిరీల్లో పోటీలు జరగనున్నాయి.

సీనియర్ టైటిల్ పోటీలు 70 కిలోల నుంచి 90 కిలోల బరువు విభాగంలో నిర్వహిస్తారు.

బాల కేసరి (బాయ్స్) విభాగంలో 50 కిలోల నుంచి 60 కిలోల బరువు కేటగిరీలో పోటీలు ఉంటాయి.

మహిళల కేసరి విభాగంలో 55 కిలోల నుంచి 60 కిలోల బరువు కేటగిరీ పోటీలు జరగనున్నాయి.

అలాగే మహిళల కోసం 35%-%40 కిలోలు, 45%-%50 కిలోలు, 60%-%70 కిలోల బరువు విభాగాల్లో కూడా పోటీలు నిర్వహించనున్నారు.

కుస్తీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు:

సీనియర్ టైటిల్ విజేతకు మొదటి బహుమతి: రూ.20,000

రెండో బహుమతి: రూ.10,000

మూడో బహుమతి: రూ.5,000


రాష్ట్ర నలుమూలల నుండి పహిల్వాన్లు వస్తారు: రాజు పైల్వాన్

సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీల నిర్వాహకుడు రాజు పహిల్వాన్

అత్తాపూర్‌లోని రాంబాగ్ మైదానంలో ప్రతీ ఏటా ఘనంగా నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలకు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పహిల్వాన్లు పాల్గొనడానికి వస్తున్నారని నిర్వాహకులు రాజు పహిల్వాన్ తెలిపారు. తమ గురువు అర్జున్ పైల్వాన్ ఆశీస్సులతో ఈ కుస్తీ పోటీలు ప్రతి సంవత్సరం విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. సంప్రదాయ మల్లయుద్ధ క్రీడలు అంతరించిపోకుండా కాపాడాలనే లక్ష్యంతో తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఎంతటి కష్టాలు ఎదురైనా ప్రతి ఏడాది ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తూ వస్తున్నానని రాజు పైల్వాన్ తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు. స్కూలు స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. శరీరం దృఢంగా ఉన్నప్పుడే మనిషి ఏ లక్ష్యాన్నైనా సాధించగలడని, అందుకే ఈ కుస్తీ పోటీలకు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కుస్తీ పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు ట్రాక్ సూట్లు, షీల్డులు, మెడల్స్, మెమొరాండమ్స్ అందజేస్తామని తెలిపారు.పోటీల నిర్వహణ బాధ్యతలను 7వ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి ఉస్తాద్ పర్యవేక్షిస్తున్నారని, క్రీడాకారులు క్రమశిక్షణ పాటిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి వందలాది మల్లయోధులు పాల్గొనే ఈ కుస్తీ పోటీలు అత్తాపూర్ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు రాజు పహిల్వాన్ తెలిపారు.

## తొర్మామిడి గ్రామ నూతన సర్పంచ్‌గా సంజీవయ్య బాధ్యతల స్వీకారం

**4 వేల ఓటర్ల గ్రామంలో విజయం సంతోషంగా ఉందన్న సంజీవయ్య**




ఇది కద నిజం, బంట్వారం మండలం:బంట్వారం మండలంలోని తొర్మామిడి గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సంజీవయ్య అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సుమారు 4 వేల ఓటర్లు ఉన్న గ్రామంలో ప్రజల విశ్వాసంతో విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతానని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పారదర్శక పాలన అందిస్తానని సంజీవయ్య తెలిపారు. తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అలాగే గ్రామ ప్రజల సహకారంతో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని, యువత, మహిళలు, రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. తన విజయంలో సహకరించిన గ్రామ ప్రజలకు, మద్దతుదారులకు సంజీవయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాఫర్‌పల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా మహేష్ కుమార్ ప్రమాణ స్వీకారం

**తహసీల్దార్ సమక్షంలో బాధ్యతల స్వీకరణ**



ఇది కద నిజం: జాఫర్‌పల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా మహేష్ కుమార్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సమక్షంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం మహేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడంతో పాటు గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా పాలన కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ ప్రసాద్ హాజరై నూతన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేదల వైద్య సేవలకు ప్రాముఖ్యత

**మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్**



ఇది కద నిజం, సికింద్రాబాద్ : నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. నార్త్ లాలాగూడ కు చెందిన మహమ్మద్ యాకుబ్ తీవ్ర అస్వస్థతకు గురై ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించడంతో ఆయనను ఆదుకొనేందుకు, వైద్య సేవలకు వీలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్.ఓ.సీ. పత్రాలను సమకూర్చి అందించారు. సితాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో రూ.1.50 లక్షల మేరకు ఎల్.ఓ. సీ. పత్రాలను కార్పొరేటర్ సామల హేమ, సమన్వయకర్త రాజ సుందర్, స్థానిక నేతల సమక్షంలో అందించారు.

## రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లియోనల్ మెస్సి సోదరి



స్పోర్ట్స్ న్యూస్, 23 డిసెంబర్ (ఇది కద నిజం): అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి సోదరి మరియా సోల్ మెస్సి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మియామి లో ఆమె కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో సోల్ మెస్సికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది.పలు నివేదికల ప్రకారం.. ఇవాళ ఉదయం ఆమె తన ఎస్‌యూవీ కారులో వెళ్తోంది. ఈ క్రమంలో ఆమె వాహనంపై నియంత్రణకోల్పోయి ఓ గోడకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోల్ మెస్సికి తీవ్ర గాయాలయ్యాయి. మడమ, మణికట్టులో పగుళ్లు వచ్చినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ ప్రమాదం నుంచి ఆమె ప్రాణాలతో బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఈ ప్రమాదం కారణంగా జనవరి 3న జరగాల్సిన మెస్సి సోదరి వివాహం వాయిదా పడింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

## విజయోత్సవ ర్యాలీలో విషాదం

**●కార్ కింద పడి బాలిక మృతి**

**●రాకంచెర్ల గ్రామంలో విషాద ఛాయలు**



ఇది కద నిజం, వికారాబాద్ జిల్లా, పూడూర్ మండలం: వికారాబాద్ జిల్లా పూడూర్ మండలంలోని రాకంచెర్ల గ్రామంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన కమ్లీబాయి పెంటయ్య గెలుపు సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ప్రమాదవశాత్తు ఒక బాలిక కార్ కింద పడి మృతి చెందింది. విజయోత్సవ ర్యాలీ ఉత్సాహంగా కొనసాగుతున్న సమయంలో అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను గ్రామస్థులు హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనతో రాకంచెర్ల గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆనందంగా జరగాల్సిన విజయోత్సవం విషాదంగా మారడంతో గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలిక మృతిపై గ్రామంలో తీవ్ర విచారం వ్యక్తమవుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

# నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం



ఇది కద నిజం, మెదక్ జిల్లా రూరల్ : మెదక్ జిల్లా మెదక్ మండలములోని పాతూర్ గ్రామంలో ఇటివలే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ విఠల్ నాగలక్ష్మి పెంటయ్య, ఉప సర్పంచ్ యాశోద ఏసుదాస్, మరియు వార్డు సభ్యులు సోమవారం రోజున స్పెషల్ ఆఫీసర్ ఆర్.ఐ.కిషోర్ మరియు గ్రామ సెక్రెటరీ పాతిమా, ఎన్నికయిన వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ విఠల్ నాగలక్ష్మి మాట్లాడుతూ మా యొక్క గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా ప్రజలకు సేవచేస్తానని చెప్పడం జరిగింది. ముఖ్యంగా గ్రామంలో అందరి సహాయ సహకారాలు తో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమములో నాయకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ఇది కద నిజం, యాదగిరిగుట్ట:యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి పాల్గొన్నారు. మంత్రివర్యులు ఆలయానికి చేరుకున్న సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం నిర్వహించారు. ఆశీర్వచన కార్యక్రమం అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకట్రావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని మంత్రికి అందజేశారు.

ఆనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధికంగా గెలిపించారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలకు ఇళ్ల పంపిణీ జరగలేదని, అయితే ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అందించామని పేర్కొన్నారు. ప్రజలకు అందించిన అనేక సంక్షేమ పథకాలను గుర్తించి, రెండేళ్లలోనే జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మంచి మెజార్టీతో గెలుపు అందించారని మంత్రి తెలిపారు. ఇదే విధంగా రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీకి లభించాలని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో ప్రార్థిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# "శబరిమల యాత్రకు బయలుదేరిన హైదర్‌గూడ అయ్యప్ప స్వాములు"



ఇది కద నిజం, అత్తాపూర్:హరిహరసుతుడు అయ్యప్ప స్వామి దర్శనార్థం హైదర్‌గూడకు చెందిన భక్తులు మండల కాల దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. విక్రమ్ గురు స్వామి ఆధ్వర్యంలో 9 మంది స్వాములు సంప్రదాయబద్ధంగా ఇరుముడి కట్టుకొని అయ్యప్ప స్వామి దర్శనానికి ప్రయాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాములు బయలుదేరుతున్న వేళ అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రావుల జగన్ వారికి శాలువాలతో సన్మానించి, శబరిమల యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని సుఖసంతోషాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి కృపతో భక్తుల కోరికలు నెరవేరాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నారగూడెం మల్లారెడ్డి, సులిగే వెంకటేష్, జయనంద్ రెడ్డితో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొని స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు.

# "భారత కరెన్సీపై లక్ష్మీదేవి చిత్రాన్ని ముద్రించాలి"

## ప్రధాన మంత్రికి జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేఎస్ఆర్ గౌడ లేఖ



ఇది కద నిజం: "భారతదేశం వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వంతో కూడిన ఒక మహత్తర నాగరికత. సంపద, శ్రేయస్సు, అదృష్టం, సమృద్ధి, నైతిక ఆర్థిక సమతుల్యతకు దివ్య ప్రతిరూపంగా దేవి లక్ష్మీ దేవిని దేశమంతటా, విశ్వవ్యాప్తంగా ఆరాధిస్తారు. భారత సంప్రదాయంలో సంపద అనేది కేవలం భౌతిక సంపత్తి మాత్రమే కాదుబీ అది ధర్మబద్ధంగా సంపాదించ బడాలి, సమాజంలో సముచితంగా ప్రవహించాలి, పరిరక్షించ బడాలి అనే పవిత్ర బాధ్యతగా భావించబడుతుంది. కరెన్సీ అనేది ఒక దేశపు ఆర్థిక బలం, స్థిరత్వం, విశ్వాసానికి ప్రతీక. భారత కరెన్సీపై లక్ష్మీ దేవి చిత్రాన్ని ఉంచడం ద్వారా సంపద నిజాయితీ గల మార్గాల్లోనే సృష్టించబడాలి, బాధ్యతతో పంచబడాలి, జాతీయ అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం వినియోగించబడాలి అనే నైతిక సందేశం ప్రజలకు చేరుతుంది.

దేవి లక్ష్మీ స్వయంగా నియంత్రిత, క్రమశిక్షణతో కూడిన సమృద్ధిని సూచిస్తుందిబీ నియంత్రణ లేని సంపద సేకరణను కాదు. చారిత్రకంగా భారత కరెన్సీపై జాతీయ గుర్తింపు, ఐక్యత, ప్రేరణకు సంబంధించిన చిహ్నాలు ఉన్నాయి. దేవి లక్ష్మీ దేవి చిత్రాన్ని చేర్చడం ద్వారా నైతిక సంపదపై ఆధారపడ్డ భారత సాంస్కృతిక విలువలు మరింత బలపడతాయి. సంపద పట్ల గౌరవం, ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది. డబ్బును దోపిడీ సాధనంగా కాకుండా జాతీయ సేవకు ఒక మార్గంగా చూడాలని పౌరులను ప్రేరేపిస్తుంది.జాతీయ కరెన్సీతో ప్రజల భావోద్వేగ, సాంస్కృతిక అనుబంధాన్ని బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిపాదన ఏ విధంగానూ మతపరమైన విభేదాలను ప్రోత్సహించడానికీ కాదుబీ ఆధ్యాత్మికత, ఆర్థిక వ్యవస్థ సౌహార్దంగా కలిసి ఉన్న భారత నాగరికతాత్మక ఆత్మను గౌరవించడానికే. దేవి లక్ష్మీ దేవి మత పరిమితులను దాటి సంపదకు ప్రతీకగా నిలుస్తుందిప్రపంచవ్యాప్తంగా విశ్వాసం, బాధ్యతను ప్రేరేపించే జాతీయ చిహ్నాల మాదిరిగానే. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం చర్చలు, నిపుణుల సంప్రదింపులు , ప్రజా అభిప్రాయం సేకరించడానికి చర్యలు ప్రారంభించాలని వినమ్రంగా కోరుతున్నాము. విలువల ఆధారిత ఆర్థిక వృద్ధిలోనే నిజమైన సంపద ఉందని నమ్మే కోట్లాది పౌరులు ఈ చర్యను హృదయపూర్వకంగా స్వాగతిస్తారు. భారతదేశాన్ని సుస్థిర సమృద్ధి వైపు నడిపిస్తూ, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి దూరదృష్టితో తీసుకునే ఈ నిర్ణయం దేశ ఐక్యతకు నాంది పలుకుతుంది నమ్ముతున్నాం " కాసాని శ్రీనివాసరావు గౌడ ఆ లేఖలో వివరించారు.

# సంక్రమణ వ్యాధుల గుర్తింపుపై ఐసీఏఆర్ వింటర్ స్కూల్ ప్రారంభం



ఇది కద నిజం, హైదరాబాద్:పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (PVNRTVU) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ సైన్స్ కళాశాలలో "సంక్రమణ వ్యాధుల గుర్తింపుకు ఆధునిక మాలిక్యులర్ బయాలజీ సాధనాలు: వన్ హెల్త్ మరియు ఫైలోజెనెటిక్ దృక్పథం" అనే అంశంపై ఐసీఏఆర్ ప్రాయోజిత వింటర్ స్కూల్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమం దీపప్రజ్వలనంతో పాటు వందేమాతరం గీతాలాపనతో ప్రారంభమై దేశభక్తి, గౌరవ వాతావరణాన్ని సృష్టించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. ఎం. విష్ణు వర్ధనరావు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైన్సెస్, హైదరాబాద్, కార్యనిర్వాహక ఉపకులపతి మాట్లాడుతూ, కోవిడ్ అనంతర కాలంలో వన్ హెల్త్ విధానం ప్రాధాన్యత మరింత పెరిగిందని తెలిపారు. మహమ్మారులు మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం, పర్యావరణం మధ్య సమన్వయం ఎంత అవసరమో స్పష్టంగా చూపించాయని, సంక్రమణ వ్యాధుల ముందస్తు గుర్తింపు, నివారణకు ఆధునిక మాలిక్యులర్ పద్ధతులు కీలకమని అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. జె. గౌరిశంకర్, ఇన్సా గౌరవ శాస్త్రవేత్త, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, "విస్తృత వన్ హెల్త్ భావన దిశగా" అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. జన్యువులు, సూక్ష్మజీవులు, పర్యావరణ వ్యవస్థలు, ప్రపంచ ఆరోగ్యం మధ్య ఉన్న అనుబంధాన్ని ఆయన సుందరంగా వివరించారు. వన్ హెల్త్ విధానాన్ని బలోపేతం చేయడంలో మాలిక్యులర్ బయాలజీ మరియు కంప్యూటేషనల్ విధానాల పాత్ర కీలకమని తెలిపారు.

ప్రొఫెసర్ ఎం. ఉదయ కుమార్, ఫ్యాకల్టీస్ డీన్, PVNRTVU మాట్లాడుతూ, కొత్తగా ఉద్భవిస్తున్న మరియు మళ్లీ ప్రబలుతున్న వ్యాధులను ఎదుర్కొనడానికి వన్ హెల్త్ విధానం అత్యవసరమని పేర్కొన్నారు. జూనోటిక్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం, పర్యావరణ రంగాల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతిభాగస్వాములకు ఆయన హృదయపూర్వక స్వాగతం పలికారు.

డా. ఎం. శ్రీనివాస రెడ్డి, కార్యక్రమ అధ్యక్షులు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వన్ హెల్త్ విధానానికి పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. సమర్థవంతమైన వ్యాధి పర్యవేక్షణ, నియంత్రణకు అన్ని విభాగాల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అకాడమిషియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ కార్యక్రమ జాతీయ ప్రాముఖ్యతకు నిదర్శనమని అన్నారు.

డా. డి. మాధురి, వెటర్నరీ సైన్స్ కళాశాల, రాజేంద్రనగర్, అసోసియేట్ డీన్ మరియు కార్యక్రమ సహాధ్యక్షురాలు, ఈ ప్రతిష్ఠాత్మక ఐసీఏఆర్ ప్రాయోజిత వింటర్ స్కూల్‌ను నిర్వహించడం కళాశాలకి గౌరవమని పేర్కొని, దేశ నలుమూలల నుంచి వచ్చిన పాల్గొనేవారికి హృదయపూర్వక స్వాగతం పలికారు.

డా. ఎ. విజయ కుమార్, కార్యక్రమ డైరెక్టర్, శిక్షణ కార్యక్రమ రూపురేఖలను వివరించారు. వన్ హెల్త్ మరియు ఫైలోజెనెటిక్ దృక్పథంతో సంక్రమణ వ్యాధుల గుర్తింపు, నియంత్రణకు అవసరమైన ఆధునిక మాలిక్యులర్ బయాలజీ పద్ధతులపై పాల్గొనేవారి జ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించడమే ఈ వింటర్ స్కూల్ లక్ష్యమని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో డా. రాహుల్ నారంగ్ (AIIMS, బిబినగర్), డా. నాగేంద్ర హెగ్డే (NIAB) తదితర ప్రముఖ నిపుణులు ఉపన్యాసాలు అందించనున్నారు.కార్యక్రమం ముగింపులో డా. ఎస్. వంశీ కృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు యూనివర్సిటీ హెడ్, వెటర్నరీ మైక్రోబయాలజీ విభాగం, కృతజ్ఞతా తీర్మానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అతిథులు, వక్తలు, నిర్వాహకులు, అధ్యాపకులు, పాల్గొన్న వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంతో వింటర్ స్కూల్ శిక్షణ విజయవంతంగా ప్రారంభమైంది.

